# పునరావృత్తము

"నవ్యశ్రీ"

ఆమె ప్రచండ ఝంఝూ మారుతము!

అతను మందమలయానిలము!

ఆమె ఏళ్ళూ, వూళ్ళూ తుడిచిపెట్టుకపోయే నది వెల్లువ!

అతను లేయెండలో మిలమిలా మెరుస్తూ గలగలా పారే పిల్ల కాలువ!

ఆమె నడివేసవి మధ్యాహ్నపు సూర్యుడు!

అతను శరత్కాలపు నిండు పున్నమినాటి చంద్రుడు!

ఆమె తారాజువ్వ!

అతనో కాకరపువ్వొత్తిరవ్వ!

ఆమె ప్రళయాగ్నికీల!

అతను హేమంత రమాజీవన హేల!

ఆమె అతని తల్లి!

అతడామెకు పుత్రుడు!...కాదు! బిడ్డడు!!

అడ్డాలనాటి బిడ్డడు గాడు! గడ్డాలనాటి బిడ్డడు!!

'అడ్డాలనాడు బిడ్డలుగాని గడ్డాలనాడు బిడ్డలా!'—అన్నారు పెద్దలు.

'ఆఁ! గడ్డాలనాడుకూడ బిడ్డలే! అక్షరాలా...' అంటుంది ఆమె. కాదన్నవాళ్ళను సవాల్ చేస్తుంది. 'దీనికి రుజువుమా రవణే!' అంటుంది. ఆరమణని చూస్తే అందరూ నోరుమూసుక తీరవలసిందే!

రమణం టే చిన్నవాడూ చితకవాడేం కాదు. పాతికేళ్ళ అబ్బాయి! ఏళ్ళకు మటుకే...మానసికంగా, రెండణాల సెవెన్ఓక్లాక్ బ్లేడు రెండు శువరాలకు గూడ పూర్తిగా చాలని గడ్డాల అబ్బాయి ఇంకా అడ్డాలనాటి అబ్బాయే! అడ్డాలలోని అబ్బాయికి, ఈ గడ్డాల అబ్బాయికి ఏమాత్రమూ తేడా లేదు. ఆ సంగతే అందరితోటి ఘనంగా చెపుతుంటుంది మహాలక్ష్మమ్మ. అందుకే అందరూ 'ఔరా!' అని ఆశ్చర్యపోతుంటారు గడ్డాలరమణను చూసి.

కాని కాలానికి మార్పు సహజం...చక్రంలా పరిభ్రమిస్తుంటుంది...

ఒక సుడిగాలిలా, మబ్బుతునకలా, వాన జల్లులా ఆ యింటిలో అడుగుపెట్టింది ప్రభ; ఆ యింటి కోడలి హోదాలో. ప్రశాంతమయిన ఆ యింటిలో సంచలనం బయల్దేరింది. ప్రభ నిజంగా కోటప్పకొండ ప్రభ!

ఆవులించకుండానే అత్తగారి ప్రేవులన్నీ లెక్కపెట్టెయ్యాలని చూసిన అసాధ్యురాలు! 'ఇదుగో వచ్చేస్తున్నాను! ఈనాటితో నీ అధికారానికి తిలోదకాలే!'...అన్నట్టు చూసింది అత్తగార్ని పెండ్లినాడే.

మహాలక్ష్మమ్మమాత్రం తక్కువదా?...ఆమె కన్నా మూడాకులు ఎక్కువే చదివింది. ఆమె కోటప్పకొండ ప్రభయితే ఈమె జగన్నాథుడి రథచక్రము! కోడలు చూపుల్లోని ఆంతర్యము, ఆమె మనోభావాల నిట్టే పసిగట్టింది. ఆనాడే ఒక అమోఘమైన పథకం తయారు చేసుకుంది.

ఆ పథకంయొక్క పర్యవసానమే కోడలును కాపురానికి తీసుకరావడానికి కొడుకును పంపుతూ ఇచ్చిన వార్నింగ్. 'ఓరేయ్ బాబూ! కొత్తపెళ్లాం మోజులో ఒళ్లు మరచిపోకు. ఇన్నాళ్లు నిన్ను కంటికి రెప్పలా కాపాడి విద్యాబుద్ధులు చెప్పించి ఒక మనిషిగా చేసింది నేను!...కాని అది కాదు...అభం శుభం తెలియని పసికుంకవు! అత్తవారి మాటలు నమ్మి మోసపోకు. ఇన్నాళ్లనుండి నిన్ను పెంచినవాళ్ళు నీ అత్తగారు కాదు, నేను!...తెలిసిందా?...నేను! సప్తమినాడు చాలామంచిది. ఆనాడు పిల్లదాన్ని తీసుకుని బయల్దేరేయి!'...అని ఘాటు ఘాటైన వార్నింగిచ్చి మరీ బండెక్కించింది. బండెక్కుతున్న కొడుకు ముఖంచూసి సంతృప్తిగా నిట్టూర్చింది. తన సలహాను కొడుకు తు.చ. తప్పకుండా ఆచరణలో పెడతాడని ఆమెకు నమ్మకమే.

ఆమె అనుకున్నట్లే అతను నడుచుకున్నాడు కూడ. వెళ్ళిననాడు, ఆ మరునాడు తప్ప సప్తమినాడు ఒక్క నిముషంకూడ అత్తవారింట్లో వుండడానికి అంగీకరించలేదు. ఆ రెండ్రోజులైనా ఎప్పుడెపుడు సప్తమొస్తుందా అని వేయికండ్లతో ఎదురు చూస్తూ కూర్చున్నాడు. సప్తమినాడు ప్రయాణమయ్యాడు. కొత్తల్లుడు గదా! ఓ వారం రోజులయినా సరదాగా వుంటాడనుకున్నారు అత్తగారూ, మామగారూ, బావమరదులూను. ఇతను సప్తమినాడే ప్రయాణమనేసరికి వారికి చాలా ఆశాభంగమే అయింది. అందరూ చాలా బ్రతిమలాడారు. ఎవరెంత బ్రతిమాలినా 'ససేమిరా!' అన్నాడు. 'మా అమ్మ ఆజ్ఞ ఎంతమాత్రమూ జవదాటడానికి వీల్లేద'న్నాడు. 'ఏడ్నావులే!'—అనుకున్నారు అందరునూ. అత్తమామలు

అల్లుడి ప్రవర్తనకు విస్తుపోయారు. ప్రభ కసలంతా అయోమయమైపోయింది. భర్త ప్రవర్తన చూడగానే తనకు మొదటే అపజయం ఎదురయ్యేటట్లుంది. అయినా దిగజారిపోబోతున్న ధైర్యాన్ని కూడదీసుకుని 'ఇంకా మించిపోయిందేముందిలే! చాలా అవకాశముంది' అని తనలో తాను సర్ది చెప్పుకుని భర్తననుసరించింది అత్తవారింటికి.

*　　*　　*

బండి దిగుతుండగానే అత్తాకోడళ్ళ చూపులు కలుసుకున్నాయి. అదీ ఒక్క క్షణంపాటే!...అయితేనేమి?...ఆ క్షణంలోనే ఒకళ్ళ పేవులు మరొకరు లెక్కలేసుకున్నారనే అనుకోవచ్చు. చిన్న చిరునవ్వుబాణం విసిరేసింది కోడలు అత్తగార్ని చూసి- నాకు నువ్వొక లెక్కా అన్నంత నిర్లక్ష్యంగా. అరికాలిమంట నెత్తికెక్కింది అత్తగార్కి. 'ఎంత పొగరు! ఎంత కావరము!! బండిదిగగానే అత్త ముండ! పెద్దది. నమస్కరించాలె అనైనా లేకుండా కొంగడాలా నిటారుగా నిల్చుని చిరునవ్వు నవ్వుతుందా?' అని లోలోపల వుడికిపోయింది. అయినా, శరీరం ఒకవంక కోపంతో దహించుకపోతున్నా దాన్ని బయటకు వెళ్ళగక్కకుండా తనలోనే అణచిపెట్టుకుని సభ్యతకు తానుకూడ చిన్న చిరునవ్వు పారేసి వెంటనే ఇంత గంభీరం పులుముకుని ఇంట్లోకి అడుగుపెట్టబోతున్న ఆ దంపతులను చూసి 'ఆగండి!'—అని ఆడపులిలా గర్జించింది. గర్జిస్తూనే కొడుకు నొకసారి తీక్ష్ణంగాచూసి ఇంట్లోకి నడిచింది. ఆ చూపులోని ఆంతర్యం గ్రహించిన రమణ పెనుగాలిలోని పండుటాకులా వూగిపోయాడు. ప్రభ కూడ తెల్లబోయింది. కాని అంతలోనే తేరుకుంది. ఒక్కసారి ఆమె శక్తులన్నీ జాగరితమయ్యాయి. అత్తగార్కి తన ప్రభ చూపించేసమయం వచ్చిందని ఒకే సరదా పడిపోయింది. 'ఆగండి!... ఆ ఆజ్ఞలో ఎంతధీమా! చూపిస్తాను ఆ ధీమా ఏమిటో' అనుకుని గబగబా ఇంట్లోకి అడుగు పెట్టబోయింది.

తటాలున వెనుకకు లాగేశాడు రమణ ఆమెను. ఇట్లా జరుగుతుందని వూహించని ఆమె ఆ ఊపుకి రమణమీద పడబోయి అతి కష్టముమీద నిలద్రొక్కుకుంది. కోపంతో ఆమెకపోలాలన్నీ ఎఱుపెక్కాయి. దెబ్బతిన్న నాగినిగా ఒక్కసారి భర్తముఖంలోకి చూసింది. ఆ చూపులకు తట్టుకోలేక అతను సిగ్గుతో తలదించేసుకున్నాడు. ఆ క్షణంలోనే అతని చూపులలోని వేడికోలు, ఆముఖంలోని ఆందోళన ఆమె పసిగట్టేసింది. ఆమె మనోనిశ్చయము పటాపంచలయిపోయింది. ఆ చూపులలోని అమాయకత్వం ఆమెను బంధించేసింది.

అట్లాగే చేష్టలుడిగి తనను చూస్తున్న భార్యను చూసి నీరసంగా జీవరహితమైన చిరునవ్వు నవ్వాడు. "అమ్మకు కోపంరాదూ?!'— అన్నాడు మెల్లిగా. ఇంతలో ఝంఝామారుతంలా అత్తగారు ప్రవేశించి ఇద్దరికీ దిష్టితీసి అవతలపారేసి 'ముందు కుడి పాదం ఇంట్లో పెట్టమ్మా. ఇట్లాంటి విషయాలు మీ చదువుకున్నవాళ్ళకు తెలీవులే!'—అని ఆజ్ఞాపించింది.

బావురుమని ఏడ్వాలనిపించింది ప్రభకు. తనకు అడుగులోనే హంసపాదు! ఆదిలోనే ఓటమి!! అంతా అయోమయంగా వుంది. తా నూహించినంత సుకరంగా లేదు పరిస్థితి. తనరాకకు ముందే అత్తగారు పెద్ద వ్యూహము అల్లింది తనకోసం. వ్యూహాన్ని ఛేదించి బయటపడేదెట్లాగా అని ఆలోచిస్తూ అత్తగారు చెప్పినట్లే చేసింది. అయిష్టంగానే ఆరోజంతా అత్తగారెట్లా ఆడిస్తే అట్లానే ఆడింది ప్రభ. ఆ రాత్రి బుట్టలోని తమలపాకులు తీయబోతున్నది ప్రభ. మహాలక్ష్మమ్మ గబగబా వచ్చి 'అమ్మాయ్! మావాడికా పిచ్చిపిచ్చి అలవాట్లు చేయమాకు. కిళ్ళీలు వేసుకోడం, సిగరెట్లు త్రాగడం, పోకిరీవేషాలెయ్యడం మా యింటా వంటా లేదు. కుఱ్ఱనాగమ్మను పాడు చేయకు' — అని విసవిసా నడిచిపోయింది ఇంట్లోకి. నిర్ఘాంతపోయింది ప్రభ. కుఱ్ఱనాగమ్మను పాడుచేయడమా? అతను ఆమెకు కొడుకైతే తనకు భర్తగాడూ? అయినా తమలపాకులు వేసుకొన్నంతలో ఎవరైనా పాడైపోతారా? పట్టలేని కోపంతో ముఖం కందగడ్డయిపోయింది. అయినా కోపానికి సమయంగాదు. కోపం తెప్పించిన వ్యక్తి సమక్షంలో లేకనూపోవడంతో ఆ కోపం క్షణికమే అయిపోయింది. కాని తన భర్తచేత కిళ్ళీ తినిపించి అత్తగార్కి శృంగభంగం చేయాలని ఒక దృఢనిశ్చయానికి మాత్రం వచ్చేసింది. తమలపాకుల చిలకలు చుట్టుకుని పాలగ్లాసు చేతపట్టుకుని గదిలోకి వచ్చింది. పేపరులో నిమగ్నుడైయున్న భర్తను సమీపించింది. ప్రక్క టేబిలుమీద పాలగ్లాసు పెట్టి చదువుతున్న పేపరు మృదువుగా ప్రక్కకు నెట్టి చిలకలు నోటికందించింది. వాటివంక చూసి ఏవో పురుగులను చూసినట్లు త్రుళ్ళిపడ్డాడు. వాటిని తన చేత్తో ప్రక్కకు తోసేస్తూ 'నాకలవాటు లేదు' అన్నాడు.

'పరవాలేదు. అలవాటుచేసుకుంటే అదే అవుతుంది. పెండ్లయినవాళ్ళు తమలపాకులు వేసుకోవాలి'— అంది ప్రాధేయపూర్వకంగా. అతను ఆశ్చర్యంగా ప్రభ వంక చూశాడు. 'అట్లాగా! అయితే అమ్మనడిగొస్తానుండు' అని లేవబోయాడు. ఆమెకు అరికాలిమంట నెత్తికెక్కింది. దుఃఖంకూడా వుప్పెనలా ముంచుకొచ్చింది. కోపంతో ఆ తమలపాకులను విసిరి నేలకేసి కొట్టింది. పోయి కుర్చీలో కూలబడి భోరున ఏడ్చేసింది.

అతను కంగారుపడి పోయాడు. గబగబా ఆమెను సమీపించి భుజంమీద చెయ్యేసి 'ప్రభా! ఏడవకు. నేను తినవంతిమాత్రంలో ఇప్పుడేం నష్ట మొచ్చింది. ఈ సంగతి అమ్మకు తెలిస్తే ఇంకేమైనా వుందా?'— అన్నాడు అనునయంగా. ఆ మాటలతో ఆమెలో కోపాగ్ని మరింత ప్రజ్వరిల్లింది. 'వెళ్ళండి! నా దగ్గరనుండి దూరంగా వెళ్ళండి!! అంటూ ఒక్క విదిలింపు విదిలించింది. 'ఏమిట్రా ఆ పెనుగులాట?'— అంటూ క్రింది నుండి కేక వినిపించింది. ఆ కేకతో అతను గడగడ లాడిపోయాడు. ప్రభకు ఒళ్ళుమండిపోయింది. 'మా భార్యాభర్తల కీచులాటలో నీ ప్రమేయ మేమిటే ముసలిపీనుగా' అని నాలుగు ఝాడాయించాలనుకుని మళ్ళీ తనను తానే అతికష్టంమీద సంబాళించుకుంది. 'ఏమీ లేదమ్మా! ఏదో పిల్లి లే. చాలా గొడవచేసింది. ఇప్పుడు పోయిందిలే!' అని సర్దిచెప్పేశాడు. ఆమాటలకు పకృన నవ్వాలనిపించింది. ప్రభకు కండ్లుతుడుచుకునిభర్తవంక చూసింది. తెలివైనవాడే! అందగాడే! ఆ తెలివితేటల్ని ఆతల్లి ముండమేఘం కప్పేసింది. అతనిమీద అనంతమైన జాలికూడా కలిగింది. పాపం! అతనేం చేయగలడు? చిన్నప్పటినుండి అటాగే పెరిగాడాయిరి. అత్తగారు మాత్రం తక్కువదా? తనూహించినంత మూర్ఖురాలు కాదు. చాలా తెలివైన ఘటం! ఎంత తెలివైనది కాకపోతేతనభర్తముందు తనఅందాన్ని కూడ ఎందుకూ పనికిరాకుండా ఎట్లా చేయగలిగింది. తను చదువుకునే రోజుల్లో ఎందరు తన అందానికి దాసులై తనచుట్టూ తిరగలేదు. తన చిరునవ్వుకోసం, తన క్రీగంటిచూపు కోసం ఎందరు తనయింటిముందు పడిగాపులు పడలేదు. కాని ఏమిటి లాభం? ఆ అందం నేటికి కొరగాకుండా పోతున్నది తన భర్తముందు. ఒక ముసలిపీనుగమాటకున్న విలువకూడా తనకు లేకుండా పోతున్నది. ఎట్లాగైనా అత్తగారి నిరంకుశత్వాన్ని అణగద్రొక్కి భర్తను ఈ సంకెళ్ళనుండి విముక్తుణ్ని చేసి అతన్నొక వ్యక్తిగా చేయాలనుకుంది.

## 2

ఆ మరునాడు కోడలికి కాఫీయిస్తూ "ఇదిగో కోడలా! క్రొత్తగదా అని ఈ రెండ్రోజులూ కాఫీ చుక్కలు ఇస్తున్నాను. మీ పుట్టింటివేషా లిక్కడ సాగవు. రేపటినుండి సలక్షణంగా ఇంత పాచన్నం పెరుగేసుకుని తిను మావాడిలాగే" అని అల్టిమేటమ్ జారీచేసింది. అమె జవాబుచెప్పే లోగానే అక్కడినుండి కదిలిపోయింది. ప్రభ నిశ్చేష్టురాలై అత్తగారు పోయినవంకే గుడ్లప్పగించి చూస్తూ నిలబడిపోయింది. కోపంతో ముఖం జేవురించింది. కాని తనకోపం ఎవరిమీద చూపడం? తన జవాబు వినకుండానే అమె మాయమయి పోయింది. ఆమె అక్కడుంటే ఆగ్లాసు ఆమె ముఖానికేసి కొట్టి నాలుగూ గట్టిగా దులిపేసేదే? ఆ కాఫీ నక్కడే వదలిపెట్టి వెనుదిరిగింది. ఇంతలోనే ఎండిన తమలపాకులతో మళ్ళీ ప్రత్యక్షమయింది మహాలక్ష్మమ్మ, ఎదురుగా ఆమె ముఖంలో విజయగర్వం తొణికిసలాడుతున్నది. ముఖంమీద చిరుకోపం తాండవిస్తున్నది.

"ఏమమ్మా! నామాట కాదనిపించాలని చూశావు గదూ వాడిచేత?" అంది వ్యంగ్యంగా. ప్రభనోట మాట రావడంలేదు. అనుకోని ఈ సంఘటన ఎట్లా ఎదుర్కోవాలో ఆమెకు తట్టలేదు. అయోమయావస్థలో పడిపోయింది. అత్తగారు కూడా గాలివానలా ఆలోచనకు ఎడతెఱిపివ్వలేదు.

"నాకు తెలుసులే నువ్వింత అఘాయిత్యాని కొడిగడతావని. కాని మావాడిముందు నీఆటలు చెల్లవు. వాడు మగమహారాజు. ఆ తండ్రికి ఎంగులోనూ తీసిపోని కొడుకు. వాడు ఆడారిరాముడు గాడే!...అవ్వవ్వ! వాడు కాస్తమెత్తనివాడైతే ఇద్దరూకలసి ఆటాడినాక్కి పాటకే వుద్వాసన చెప్పేద్దురన్నమాట?...ఆసినీ అఘాయిత్యంకూల!' అని నాలుగూ గబగబా అనేసి మెరుపులా మాయమైపోయింది క్షణంలో. ఈ అకస్మాత్తుగా వచ్చిన గాలివానకు నడిసంద్రములోని నావలా అల్లల్లాడిపోయింది ప్రభ. గబగబా పోయి మంచంమీద పడుకుని, వెక్కివెక్కి ఏడ్వసాగింది ప్రభ. ఇంతలో రమణ వచ్చాడు గదిలోకి. ఏడుస్తున్న భార్యను చూడగానే ఎక్కడలేని జాలి పుట్టుకొచ్చింది అతనికి. రెండుభుజాలు పట్టుకుని ఆమెను తనవైపు త్రిప్పుకున్నాడు.

'ఏడుస్తున్నావా?'—అడిగాడు.

"లేకపోతే నవ్వమన్నారా?"—ఉక్రోషంతో అడిగింది కన్నీరుతుడుచుకుంటూ. అతను భారంగా నిట్టూర్చి ఆమెను వదిలి ప్రక్కకు తిరిగాడు. ఎదురుగా గుమ్మం దగ్గిర ప్రత్యక్షమయింది ప్రచండకాళి ఆకారంలో మహాలక్ష్మమ్మ. 'ఊఁ! చూస్తున్నానురా నాయనా! అంతా కనిపెడుతూనే వున్నా. ఈ రెండ్రోజుల్లోనే చాలా మారిపోయావురా. అయినా ముంకొచ్చిన చెవులకన్నా వెనుక మొలచిన కొమ్ములు వాడని వూరికనేరా అన్నారా పెద్దలు? ఇట్లా పెండ్లాం కొంగు పట్టుక అఘోరించే చవట వనుకోలేదురా? నాకర్మగాలి నీకీ బుద్ధులు పుడుతున్నాయి. నిన్ను చూసి అక్కడి ఆ మహారాజెంత ఇదవుతున్నారో? అయినా ఇదంతా నారాత!'-అని కొంగు ముఖాని కడ్డుపెట్టుకుని గుడ్లనీరు గ్రుక్కుకుంటూ వెనుతిరిగింది. అతను విచలితుడైపోయాడు. తన తలికింత కోపం రావడం అతనింతకుముం దెన్నడూ చూడలేదు: భయంతో గజగజలాడిపోయాడు. పోతున్న తల్లివంక దీనంగా చూసి 'అమ్మా!' అంటూ వెంటబడ్డాడు.

ఆ దృశ్యం చూసిన ప్రభ కొయ్యబారిపోయింది. ఆ తల్లీ కొడుకులవంక చూస్తూ అట్లాగే నిలబడి పోయింది.

* * *

మహాలక్ష్మమ్మ తిరిగిపోతున్న కొడుకువంక చూసి విజయసూచకమైన చిన్న మందహాసం చేసింది. 'పిల్ల కాకికేం తెలుసు వుండేలు దెబ్బ? తన అధికారానికే ఎసరు పెట్టాలని చూస్తుందా తనకోడలు? తనకొడుకు తన చెప్పుచేతల్లో వున్నంతకాలం ఇది కాగుగదా, దీన్ని పుట్టించిన జేజేలొచ్చినా తనమాట కెదురుండదు' అనుకుంది. డాబా వంక చెవులు రిక్కించి వినసాగింది.

'ప్రభా! రేపటినుండి నువ్వుకూడా ఒకపూట మడికట్టుకుని వంట చేయాలి. అమ్మ చాలా ముసలిదయిపోయింది. ఎంతకాలం ఆమె ఈ చాకిరీ అంతా చేస్తుంది చెప్పు?'—అంటున్నాడు కొడుకు. మహాలక్ష్మమ్మ సంతృప్తిగా నిట్టూర్చి ఇంట్లోకి పోయింది.

ప్రభ రమణవంక వింతగా చూసింది.

'ఈమాటలు మీ అమ్మ అనమన్నదా? మీరే స్వంతంగా అంటున్నారా?'–సూటిగా కండ్లలోకి చూస్తూ కొంటెగా అడిగింది. రమణ కొంచెంసేపు తడబడ్డాడు. కాని ఆ తడబాటును ఎట్లాగో కప్పిపుచ్చుకుంటూ 'నేనే అంటున్నాను' అన్నాడు కొంచెం హుందాతనం గొంతుకలో తెచ్చిపెట్టుకుని. పకాలుమని నవ్వాలనిపించింది ప్రభకు. కొద్దిగా అతన్ని ఏడిపించ బుద్ధయింది కూడా. వచ్చేనవ్వును ఆపుకుని కాస్త గంభీరం పులుముకుని 'నాకు వంట చేయడం రాదే!'—అన్నది. సడెన్‌గా గుండెలు కొట్టుకోవడం మానేశాయి రమణకు. భయం భయంగా ఆమె ముఖంలోకి చూశాడు ఆమె తనవంకే చూస్తున్నది. ఆచూపులు సూటిగా తన హృదయ కుహరంలోనికి చొచ్చుకునిపోయి అంతా గాలిస్తున్నట్లున్నాయి. వాటికి తట్టుకోలేక తలదించేసుకున్నాడు. అయితే ఏమిటింక తనగతి? అడకత్తెరలో పోకచెక్కమాదిరయింది తనపని. ఇప్పటికే తనమీద తల్లికి బోలెడంత అనుమానం ప్రబలిపోయింది. ఈసంగతి ఆమెకు చెపితే తనమీదే విరుచుకపడుతుంది. పైగా తనమాటలు నమ్మదు కూడాను. ఇదంతా తామిద్దరూ కలసి ఆడుతున్న నాటకం అంటుంది. ఎట్లాగైనా ఈ గండం గడిచి బయటపడాలంటే ప్రభచేత వంటపనికి ఒప్పించాలి. రాకపోయినా సరే నేర్చుకుని చెయ్యమనాలి. తల్లిని బ్రతిమాలేకన్నా ప్రభను బ్రతిమాలికునేమంచిదేమో? ఒకదారికి రాకపోదని నిశ్చయించుతేన్నాడు. గబాలునపోయి ఆమె రెండు చేతులూ గట్టిగా పట్టుకున్నాడు. దీనంగా ఆమె కండ్లలోకి చూస్తూ.

'ప్రభా! ఇవి చేతులుగావు. కాళ్ళనుకో......' గబాలున ప్రభ అతని నోరు మూసేసింది. అతనిమీద ఎక్కడలేని జాలి, అభిమానం పుట్టుకొచ్చాయి.

'అబ్బబ్బ! రెండురోజులే రెండుయుగాలుగా గడిచాయే! ఇంక ఈ 'యమధర్మరాజు'తో' నరకంలో ఎట్లా గడపాలి చెప్పండి! అయినా ఆమె అంత మూర్ఖులుంటారనుకోను ఈ ప్రపంచములో' అంది భటే ముఖంలోకి చూస్తూ.

'ఏం చేస్తాం ప్రభా? మనమే ఎట్లాగో సరిపెట్టుకోవాలి కాల మెక్కరీతిగా వుండదు. కొన్నాళ్ళకు ఆమే మారొచ్చు ఏమంటావు ప్రభా? నేను చెప్పిన పని చెయ్యవూ?' అన్నాడు జాలిగా చిన్నపిల్లాడిలా ఆమె హృదయం కరిగిపోయింది.

'ఊఁ! సరే' అన్నది భారంగా నిట్టూరుస్తూ. భర్త ముఖంలోని సంతోషరేఖను చూసి 'పాపం! అమాయకుడు' అనుకుంది. ఆక్షణంలోనే అతన్ని నరకం నుండి విముక్తుణ్ణి చేసి ఒకవ్యక్తిగా మార్చాలనుకున్న నిశ్చయము కూడా గట్టిపడిపోయింది.

## 3

మూడు నెలలు దొర్లిపోయాయి కాలచక్రంలో. పరిస్థితులు కూడా అధ్వాన్నమయి పోయాయి. ఎప్పుడూ జగడాలు, దెబ్బలాటలతో ఇలంతా నరకమైపోయింది. రమణ పరిస్థితి మరీ దిగజారిపోయింది. ఎటూ తేల్చుకోలేడు. చిన్నప్పటినుండి తల్లి చెప్పుచేతల్లో పెరిగినవాడవడంచేత స్వంత నిర్ణయం చేసుకునే సామర్థ్యం లేదు. అదేనాడో తల్లి అధికారానలానికి ఆహుతైపోయింది. తల్లికి దూరంగా పోయేసామర్థ్యంలేదు. అసలా మాటంటేనే అతనికి ఒళ్లంతా కంపరమెత్తినట్లుంటుంది. ఏదో తెలియని అనుబంధం, ఆకర్షణ అతన్ని రోజురోజుకూ భార్యకు మరీదగ్గరసా తీసుకపోతున్నాయి. తనకి తెలియకుండానే భార్యకు దగ్గరైపోతున్నాడు రోజురోజుకి. ఈ ద్వైధీభావ సంఘర్షణలో అతని 'లేతమనస్సు' నలిగిపోతున్నది. ఏమి చేయడానికీ అశక్తుడయ్యాడు. ఈ అశక్తత కూడా అతనికి నష్టంగానే పరిణమించింది. రెండుప్రక్కల నుండి అతనిమీద దాడి ప్రారంభమైంది. తల్లి, భార్య కూడా ఈ ముభావాన్ని అపార్థం చేసుకోసాగారు. దానితో అతని స్థితి మరీ నరకమైపోయింది. ఎక్కడికైనా పోదామనిపించినా అదికూడ అతని విషయంలో అసంభవమే. ఇంతవరకూ తల్లిచాటుగా పెరిగిన తను ఒంటరిగా పోగలడా? అమ్మయ్యో! అది కలలోగూడ జరగని విషయము. అతనిమీద అతనికే అసహ్యము కలుగుతున్నది. తనకన్నా పశుపక్ష్యాదులు నయం. కొంతవయసొచ్చేసరికి తమఆహారం అవే సంపాదించుకు స్వతంత్రంగా బ్రతుకుతాయి! కాని తానెప్పటికీ అస్వతంత్రుడే!

# పునరావృత్తము

లోపల వట్టిల్లు కడుగుతున్న తల్లి సాధింపులూ, తన భార్య జవాబులు వినపడుతున్నాయి. వారిద్దరి వాదన వినలేక 'శివశివా!' అని రెండు చెవులూ మూసేసుకున్నాడు. ఇంతలో విసురుగా ప్రభ గదిలోకొచ్చి పడింది. ఆమె ఆకారం చూసి నిశ్చేష్టుడయ్యాడు. 'అబ్బ! పెండ్లినాటికి, ఇప్పటికి ప్రభలో ఎంతమార్పు!' అనుకుని కుమిలిపోయాడు తనలో. ఆమె విసురుగా చేతిలోని పాలగ్లాసు బల్లమీద పెట్టి వచ్చి అతని గుండెలమీద వ్రాలి ఏడువసాగింది. అతను చలించిపోయాడు.

'ఊరుకో ప్రభా! ఏడువకు' అన్నాడు ఆమె వీపు నిమురుతూ.

'నేనీ నరకంలో ఒక్కక్షణం వుండలేను'— అంది గద్గదస్వరంతో.

'ఉండక మనము పోయేదెక్కడికి ప్రభా? ఈ బంధం త్రెంచుకుంటే తెగుతుందా? పరిస్థితులు చక్కబడే వరకూ ఎవరో ఒకరు సర్దుకపోవాలి.' ఆమె కోపంతో కంపించిపోయింది.

'సర్దుకపోవటం! సర్దుకపోవటం!! ఎంతకాల మీ సర్దుకునిపోవటం? ఒకటీ రెండూ కాదు. మూడు నెలలు గడిచాయి. కాలంతోపాటు పరిస్థితులు మరీ విషమిస్తున్నాయిగాని దారినిపడే సూచనలు ఏకోశానా కనపడ్డంలేదు. ఇంక ఎంత మాత్రం నేనీ ఇంట్లో వుండను. పదండి ఎక్కడికైనా పోదాం.'

ఆమె కన్నీటితో అతని చొక్కా యావత్తూ తడిసిపోయింది. అతను నిరుత్తరుడైపోయాడు. ఎదురుగా కిటికీలోనుండి బయటకు చూడసాగాడు మౌనంగా. అతని మౌనాన్ని ఆమె భరించలేకపోయింది. గభాలున కిటికీ దగ్గరకు పోయి నిలబడ్డది. బయటకు చూడసాగింది. ఆమె హృదయం బరువుతో, ఆవేదనతో నిండిపోయింది. బయట డాబామీద వెన్నెల పిండారబోసినట్లుంది. చల్లని మలయమారుతము కిటికీ గుండా గదిలో చొరబడి వారి శరీరాలను తాకి కితకితలు పెడుతున్నది. ప్రశాంతమైన ఆ ప్రకృతి! ఆ చల్లని వెన్నెల! ఆ మందమలయానిలము!! ఆమె భారంగా నిట్టూర్చింది ఆ నిట్టూర్పు విన్నాడు. మెల్లగా వచ్చి ఆమె వెనుక నిలబడ్డాడు. అతని వెచ్చని శ్వాస ఆమె శరీరాన్ని తాకగానే ఆమె వెనుకకు తిరిగింది. ఆమె కనుకొలకులలో అశ్రుబిందువులు నిలిచాయి. అతని హృదయం కలుక్కుమంది. తన చొక్కాతో ఆమె కన్నీటిని తుడిచాడు. 'బయటకు చూడండి! వెన్నెల ఎంత అందంగా వుందో? ప్రకృతి ఎంత సుందరంగా వుందో!' - అంది. అతను తెల్లబోయి ఆమె ముఖంలోకి చూశాడు ఏమీ అర్థంకాక.

'పదండి! మనను ఆవరించుకున్న ఈ చీకటిని వదలి ఆ వెన్నెలలోకి పోదాం'-అంది. చుట్టూ చూశాడు. గదిలో దేదీప్యమానంగా ట్యూబులైటు వెలుగుతున్నది. ఇంత లైటుంటుంటే గదిలో చీకటంటుందేమా అని ఆశ్చర్యపోయాడు. ప్రభమాటల అర్థం అతనికి అవగతం కాలేదు.

'అదేమిటి ప్రభా! ఇంత వెలుగుంటే ఈ గదిలో చీకటంటావు? అయినా ఈ శీతకాలపు వెన్నెల మంచిది కాదుట. నాకు జలుబు చేస్తుంది. నేను రాను. కావలిస్తే నువ్వెళ్లి తిరిగిరా' అన్నాడు అమాయకుడు. ఒక్కసారి గొడ్డలిపెట్టు తిన్నట్టయింది ఆమెకు. ఆమెకు ఒళ్ళు మండిపోయిందికూడ. ఏమని చెబ్బా? తనమాట లర్థం చేసుకోడేం? చిన్న పిల్లడికన్నా అన్యాయం!! ఈమనిషి ఎట్లా బియ్యే ప్యాసయ్యాడో? ఒక్కసారి ఈ కోపమంతా అత్తగారి మీదకు మళ్లింది. అది తల్లి కాదు! రాక్షసి!! ఒకనిని చేతులారా ఎందుకూ పనికిరాని నిష్ప్రయోజకుడిగా చేసింది!! భర్తమీద అంతలోనే ఎక్కడలేని జాలి పుట్టుకొచ్చింది. ఆమెలోని మనోనిశ్చయం మరొకసారి తొంగి చూసింది బయటకు. మరోసారి ప్రయత్నించి చూడాలని నిశ్చయించుకున్నది.

'అట్లా కాదు. మీరుకూడా రండి. మనిద్దరం కలసిపోదాం. ఈ నరకంనుండి బయటకు వెన్నెలలోకి స్వేచ్ఛలోకి పోదాం. రండి'-అందిమళ్లీ సానునయంగా. అతను భారంగా నిట్టూర్చాడు. భార్యమాటల్లోని అంతరార్థం ఇప్పుడే అవగతమవసాగింది కొద్ది కొద్దిగా. అయినా ఏం మాట్లాడాలో తెలియక మౌనంగా బయటకు చూస్తూ నిల్చున్నాడు.

'పదండి ఇద్దరం కలిసిపోదాం! ఎంతకాలం ఈ అత్తగారి చెప్పుక్రింది తేళ్లా నేనూ, ఆమెకు అణిగిమణిగి మీరూ పడివుంటాము? భర్త వ్యక్తిత్వము మంటకలిసిపోతుంటే ఏభార్య భరించగలదు? భార్య బానిసగా బ్రతకడం మొగాడైన భర్తకు ఎంత అప్రతిష్ఠ? పరువుచేటు!'-అంది పొదిలోని అస్త్రం తీసి ప్రయోగిస్తూ. ఆమె ప్రయోగించిన ఈ అస్త్రం కొద్దిగా పని చేసిందనే చెప్పాలి. ఆమాటలు కాస్త ఘాటుగానే నాటుకున్నాయి అతని మనసుకి. కొద్దిగా సంచలనం ప్రారంభమయింది. అంతర్గతంగా ఆ సంచలనంలోనే ఒక సందేహం కూడా పొడసూపింది.

'ఎట్లా పోగలం ప్రభా? మనకి డబ్బో?' - అడిగాడు అమాయకంగా. అతనో దారిలో పడుతున్నాడు కదా అని ఆమె చాలా సంతోషించింది. దానిని బయటకు కనిపించనియకుండానే 'గడించుకుందాం?'-అంది. ఆమె త్రొణుకూ, బెణుకూ లేకుండా. అతను త్రుళ్లిపడ్డాడు. గడించుకోవడమా? అతని చిన్ననాడే ఆ పదం అతని నిఘంటువునుండి తుడిచిపెట్టుకపోయింది. తండ్రి బోలెడుఆస్తి వదలిపోయాడు. కొన్నితరాల వరకూకూడ తరగని ఆస్తి. కావలసినపుడు అమ్మనడిగి

తీసుకోడం, ఖర్చు పెట్టుకోవడం తెలుసునుగానీ ఇంత వరకూ గడించుకోవలసిన అవసరం కలుగలేదు. ఇక ముందు కలుగదు కూడా. అంతా అయోమయంగావుంది.

'ఎట్లా ?'—అడిగాడు అమాయకంగానే.

'ఉద్యోగంచేసి'—అందామె ఈ చంటిపిల్లాడి ప్రశ్నలకు విసుక్కుంటూ. గుండెల్లో రాయి పడింది. తన కుద్యోగమా ? తానసలు స్వతంత్రంగా వుద్యోగం చెయ్యగలడా ? అన్న భయసందేహాలు పట్టుకున్నాయి. వాటినే బయటకు వెళ్ళగ్రక్కేశాడుకూడ. బయటకు ఒక్కసారిగా పందెంవేసుకుని వుబికివచ్చే కోపాన్ని, నవ్వునూ తనలోనే అణచుకుంది అతి ప్రయత్నంమీద.

'ఏం ఎందుకు చెయ్యలేరు ? మీకేం తక్కువయింది ? నిక్షేపంలా బి. ఏ. ప్యాసయ్యారు. అవకాశ మివ్వకుండా మిమ్మలను మీ అమ్మ నిర్దాక్షిణ్యంగా, స్వార్థంతో అగణద్రొక్కేశారు గని లేకపోతే అందరికన్నా ఎక్కువగానే వుందురు మీరు'—అంది. అదికూడా సమంజసంగానే కనిపించింది. కాని తల్లి తన స్వార్థంకోసం కొడుకును పనికిరాకుండా చేస్తుందా అన్నదే అర్థంకాలేదు. అయినా ఇప్పటిదాకా తనకొచ్చిన లోటేమిటో కూడా అతనికి అర్థంకాలేదు. ఆ రెండు సందేహాలే అతడు భార్యముందు అమాయకంగా వెళ్ళగ్రక్కేశాడు.

ఆ సందేహాలకు ప్రభమాత్రం ఏం జవాబు చెపుతుంది. ఆమెకుకూడ చివరకు మౌనమే శరణ్యమయింది. కొద్ది క్షణాలు ఆ గదిలో నిశ్శబ్దం తాండవించింది. చివరకు ప్రభే ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ 'మీరుద్యోగం చెయ్యొద్దులెండి. నేను చేస్తాను. మీరుద్యోగం చెయ్యలేరని నాకు తెలుసు. అయినా ఈ కాలంలో మొగవారికి వుద్యోగాలు దొరకడంకూడ కష్టమే. కాని ఆడదానికిమాత్రం సులభంగానే దొరుకుతున్నాయి లెండి వుద్యోగాలు'—అంది వుక్రోషంగా.

'ఆడది వుద్యోగం చెయ్యడమా ?'—అడిగాడు త్రుళ్ళిపడి.

'ఏం? ఎందుకు చెయ్యకూడదు ? మీ అమ్మ ఇంటిపెత్తనం అంతా మొగరాయుడిలా చలాయించగాలేంది ఆడది వుద్యోగం చేస్తేనేనా తప్పు ?' — అడిగింది కోపంతో అత్తగారిమీద తన అక్కసు నంతా వెళ్ళగ్రక్కుకుంటూ. అతనికేం జవాబు చెప్పాలో తెలియలేదు. చివరకెటూ తేల్చుకోలేక 'వద్దు ప్రభా ! నువ్వు ఉద్యోగం చెయ్యొద్దు. అయినా మన కిప్పుడేం తక్కువ?' —అడిగాడు అమాయకంగా, సానునయంగా. 'అన్నీ తక్కువే! గొడ్డులా చాకిరీచేయించుకుని నాలుగు తిట్టి ఇంత అన్నం పడేస్తున్నది నాకు. మిమ్మల్ని తన చెప్పు క్రింది తేల్లా అణగద్రొక్కి ఆటలాడుతున్నది మీ అమ్మ. మీ యీడువాళ్ళు అందరూ మీలాగే వున్నారా ఆలోచించండి?'—అంది మరో అస్త్రం తీసి ప్రయోగిస్తూ—ఆమె నయనాలు అశ్రుపూరితాలయాయి. ఆమె చెప్పింది అతనికి సబబుగానే కనిపించినా ఏవో తెలియని శక్తులు అతన్ని వెనుకకు లాగుతున్నాయి. అయినా ఆమె ముఖంలో మనోనిశ్చయాన్ని చూసి చలించి పోయాడు మెల్లిగా 'ప్రభా! కాస్త బాగా ఆలోచించే అంటున్నావా?' —అడిగాడు.

'ఆలోచించాను. మూడు నెలలు ఆలోచించి ఈ నిశ్చయాని కొచ్చాను. మీ అమ్మ నన్నడ్డలేదు. నాకు తెలుసు. ఆమె ప్రభావం నా మీద పనిచెయ్యదని ఆమెకూ తెలుసు. అందుకే ఆమె నన్ను దూరంగా వుంచడానికే ప్రయత్నిస్తున్నది. ఆమె నన్నర్థం చేసుకోడానికి ప్రయత్నించదని కూడా నాకు తెలుసు. అయినా ఆమె తన మనసు మార్చుకుంటుందేమో నన్న ఒక ఆశతో ఇన్నాళ్ళూ వేచి వున్నాను. కాని ఆ ఆశ నిరాశ అయింది. ఇంక నేనీ యింట్లో ఒక క్షణం వుండలేను. నేనే పోతాను. నేను పోతూ ఒకమంచి పని కూడా చెయ్యాలని వుంది. తల్లిగా పుత్రుని మీద ఆమెకెంత అధికారముందో. భార్యగా మీ మీద నాకూ అంత అధికారముంది. ఆమె మిమ్మలను ఇంత పనికిరాని వాళ్ళగా చేస్తుంటే మిమ్మలను ఆమెనుండి తప్పించి ఒక వ్యక్తిగా చేయవలసిన బాధ్యత నాకూ వుంది. పదండి. ఈ నరకంనుండి ఇద్దరం కలిసే బయటపడుదాం'—అంది అతన్ని కుదుపుతూ ఆవేశంతో. అతను ఎటూ తేల్చుకోలేని సందిగ్ధంలో పడ్డాడు. చివరకు మెల్లగా 'ప్రభా ! అమ్మను నువ్వు పొరపాటుగా అర్థంచేసుకుంటున్నావేమో ? ఆమె మన మంచికే...—'

ఆమెకు ఒళ్ళు మండింది, 'ఆఁ! మంచీ నా బొందానూ ? ఇంకా ఎందుకీ నసుగుడు ? వేరేకాపురం పెడదాం పదండి. మీరు సంపాయించొద్దు. నేనే సంపాదిస్తాను'— అంది. ఆ గొంతులో ఒక నిశ్చయము ధ్వనిస్తున్నది. అతను కాస్త చలించాడు.

'అదికాదు ప్రభా! అమ్మ ముసలిదైపోయింది. బ్రతికినన్నాళ్ళు బ్రతుకదు. ఈ నాల్గురోజులకి మనమెందుకు రొష్టుపడటం ?' — అన్నాడు. ఆమెకు ఎక్కడలేని కోపం పుట్టుకొచ్చింది.

'మన మంతా వల్లకాట్లోకి పోయాక ఆమె పోతుంది. మీరు రాకపోతే నేనిట్లాగే ప్రాణాలొదిలేస్తా' — అంది విసుపూ, కోపమూ, విసుగుదలా మిళితమైన స్వరంతో. అతను పెనుగాలిలోని పండుటాకులా వూగిపోయాడు.

'నిఝంగానా ?' — అడిగాడు నీరసంగా.

'అవును' — అంది ఆమె నిశ్చలంగా. అతని ముఖంలో కత్తివేటుకి నెత్తురు చుక్కలేదు.

ముఖం పాలిపోయింది. గొంతు బొంగురుపోయింది.

'వద్దు ప్రభా! వద్దు. నువు చనిపోవద్దు. నువ్వే పని చెయ్యమంటే ఆ పనే చేస్తాను.' అన్నాడు జాలి, భయం మిళితమైన చూపులతో ఆమెను చూస్తూ.

ఆమె ముఖం కాంతి ప్రపూరితమైంది.

భయదజీమూత సంకులరోదసిలో మెరసిన మెరుపుతీగలా ఆమె ముఖంమీద మందహాసద్యుతి వెలిగింది.

'పదండి. ఈ క్షణమే పోదాం. నా దగ్గర రైలుఖర్చు లున్నాయిలెండి. ముందు మా వాళ్ళింటికి పోదాం'— అని తక్షణం బట్టలు సర్దటంలో నిమగ్నురాలైపోయింది.

'అమ్మతో ఈ సంగతి చెప్పొద్దూ?' — అడిగాడు అమాయకంగా ఆమె బట్టలు సర్దుతుంటేనూ. ఆమె ఒక్కసారి అతని ముఖంలోకి చూసింది. ఆమెకు ఏదో స్ఫురించింది. అతడిమీద జాలి కూడ కలిగింది.

'సరే. మీరు వెళ్ళి చెప్పేసిరండి. నేనీలోపున బట్టలన్నీ సర్దేస్తాను'—అంది. అతను ఒక నిశ్చయంతో తలుపుతీసుకుని బయటపడ్డాడు. అతనిని చూసి ఆమె సంతృప్తిగా నిట్టూర్చింది. ఇక తన భర్త తనవాడే- తన అత్తగారింక తననూ, తన భర్తను ఏం చేయలేదు' అని ధీమాగా బట్టలు సర్దసాగింది.

తల్లి మంచం వరకూ గబగబా ఒక నిశ్చయంతో నడిచాడు రమణ. అప్పటికప్పుడే చెప్పాలసిన మాటలు రెండుమూడు సార్లు రిహార్సలు వేసుకున్నాడు. తీరా ఆమెను చూడగానే ఆ నిశ్చయం సగానికి సగం హారతి కర్పూరంలా హరించిపోయింది. నిద్రపోతున్న ఆమెను చూడగానే ఏదో చెప్పలేని భయం అతని మనస్సుని ఆవహించింది. అయినా సడలిపోతున్న గుండె నిబ్బరాన్ని ఆత్మవిశ్వాసాన్ని అతికష్టం మీద కూడదీసుకుంటూ 'అమ్మా!' అని పిలిచాడు. ఆమె యిటూ అటూ కదిలింది. అతను గుండెలు బిగబట్టుకుని ఆమె వంక చూస్తున్నాడు. కూడుకుంటున్న అతని గాంభీర్యం మెల్లిమెల్లిగా దిగజారిపోతున్నది. ఆమె కండ్లు విప్పి ఎదురుగా నిలబడున్న పుత్రరత్నాన్ని చూసి 'ఏమిరా ఇంత అర్ధరాత్రి అయినా ఇంకా మేలుకునే వున్నావు? ఏమిటీ రాచకార్యం నాతోటి?'— అంది కాస్త విసుగ్గా. ఆ విసుగుదల, ఆమె వాలకం చూసేసరికి ఆ వున్న ధైర్యం కాస్త కూడ పుటుక్కున దిగజారిపోయింది. అతనిలోని నిశ్చయము మంచులా కరగి మాయమైపోయి మామూలు మనిషైపోయాడు. భయం భయంగా 'మంచినీళ్ళు కావాలమ్మా' అన్నాడు ఏం జవాబు చెప్పాలో తెలియక తికమక పడిపోతూ.

'వెఱ్ఱినాగమ్మా! మంచినీళ్లు నా మంచం దగ్గరుంటాయి రా? అయినా ఆ మాత్రం దాన్కి నన్ను లేపాలా? బిందెలో వున్నాయి... అయినా అది ఇందాక మంచినీళ్లు పట్రాలేదా?' అంది వుత్సాహంగా లేచి కూర్చుంటూ. అతని పైప్రాణాలు పైనే పోయాయి. ఆమె వాలకం చూస్తే ఆ యింట్లో పెద్ద గాలివాన వచ్చేలాగుంది. అదీ గాక ప్రభ 'మూడ్' కూడ బాగుండలేదు. తల్లిని తానే స్తిమితపర్చాలని నిశ్చయించుకుని ముఖం మీదకు లేని చిరునవ్వు తెచ్చుకుని-

'తెచ్చిన నీళ్లు అయిపోయాయమ్మా. దాన్ని నిదుర లేపడమెందుకని నేనే దిగొచ్చాను' అన్నాడు.

'సర్లే! ఏదో అఘోరించావు. పోయి పడుకో!' అని ఆమె దుప్పటి ముసుగు పెట్టుకొని పడుకుంది.

'అమ్మయ్య!' అనుకుని ఒక్క అంగలో తిరిగి మేడ మీది తన గదిలోకొచ్చి పడ్డాడు. తన వంకే రెప్ప వాల్చకుండా చూసే ప్రభ చూపులకు తట్టుకోలేక దోషిలా తల వంచుకుని నిలబడ్డాడు. విషయం గ్రహించడానికి కట్టేసేపు పట్టలేదు. ఆమెలో దుఃఖం, కోపం ఒక్కసారిగా వచ్చేశాయి. రెండింటిని అతి కష్టం మీద తనలోనే అణచుకుని గంభీరంగా, నిర్లిప్తంగా 'మీరు రావద్దులెండి. నేనే పోతాను' అంది. ఆమె కంఠము గద్గదమైపోయింది. ఆమెలోనుండి అలలు అలలుగా వచ్చే దుఃఖాన్ని ఎంత ప్రయత్నించినా నివారించుకోలేకపోయింది. మంచం మీద పడి తలగడలో తల దూర్చి వెక్కి వెక్కి ఏడ్వసాగింది.

అతను కొయ్యబొమ్మలా మ్రాన్పడిపోయాడు. అతని కాళ్ల క్రింది భూమి కంపించిపోతున్నట్లయింది. ఆమెనిశ్చయానికి తిరుగులేదు. ప్రభ వెళ్లిపోతుంది. నిశ్చయంగా వెళ్లిపోతుంది. ఇంకతనతో ఆమెకే ప్రమేయం లేదు. ఆమె వెళ్ళిపోవడం ఖాయం. కాని తానీయింట్లో నిలువలేడు. ఆపవిత్ర బంధంలో ఎంత బలముందో గాని ఈ మూడు నెలలలోనే ఆమె తన హృదయాన్ని ఎంతలా పెనవేసుకపోయింది. అయినా తనామెతో పోలేడు, తల్లి మాటను కాదనే సామర్థ్యం తనలో లేదు. తన బలహీనతకు లోలోపలే కుమిలిపోయాడు. కండ్ల వెంట చిమ్మే కన్నీటిని కూడ ఆపుకో ప్రయత్నించలేదతను. అట్లాగే ప్రభవంక చూస్తూ శిలాప్రతిమలా నిల్చుండిపోయాడు. ఆమె తలెత్తి భర్తను చూసింది. గభాలున వచ్చి అతని గుండెల్లో తలదాచుకుని ఏడ్వసాగింది. 'ఇప్పటికైనా మించిపోయిందిలేదు. నాతో వచ్చేయండి. అయినా నాదే తప్పు. ఆమెతో చెప్పవలసిన అవసరం లేకపోయినా మిమ్మల నవసరంగా ఆమెవద్దకు పంపించాను'అంది గద్గదకంఠంతో. ఆమెను వదిలించుకుని అక్కడే ఈజీ ఛైరులో కూలబడ్డాడతను. రెండు చేతుల్లో ముఖం దాచుకున్నాడు. 'రాలేను ప్రభా! నావల్ల కాదు. నాకు ధైర్యంలేదు. అమ్మనెదిరించే శక్తి నాలోలేదు.' అన్నాడు చిన్నపిల్లాడిలా వెక్కి వెక్కి ఏడుస్తూ. ఆమె గభాలున పోయి మంచం మీద పడుకుని ఏడ్వసాగింది.

* * *

ప్రభకు తెలివొచ్చేసరికి బల్లమీది టైంపీసు మూడు గంటలు చూపెడుతున్నది. బెడ్ లైటుకాంతిలో ఈజీఛైరులో నిద్రపోతున్న రమణను చూసింది. వర్షము వెలిసిన తర్వాత చెదురుమదురు మబ్బులతోవున్న ఆకాశంలా ప్రశాంతంగా వుంది కన్నీరు చారికలు కట్టిన అతనిముఖం. అంత సంఘర్షణ జరిగాకకూడా ప్రశాంతంగా నిద్రపోతున్న రమణనుచూసి అతనిమీద జాలి, కోపం, అసూయ, దుఃఖం ఒక్కసారిగా ముంచుకొచ్చాయి. చుట్టూ గదినంతా కలయజూసింది. ఒక వంక తన ట్రంకుపెట్టె, చిందరవందరగా పడున్న బట్టలు కనిపించాయి. ఎదుటి అద్దంలో తన ప్రతిబింబం కనిపించింది. తన రూపంమీద తనకే అసహ్యం కలిగింది. ఇన్నాళ్లూ అందాన్ని జయించేది ప్రపంచంలో ఏదీ లేదని భ్రమించింది. కాని అందాన్నికూడ జయించిన బంధం ఈ నాడు తాను చూసింది ఆతల్లి కొడుకుల మధ్య. తెలిసికూడ తానీపెండ్లి కొడంబడిన దెందుకు? అత్తగారి అధికారాన్ని అడగద్రొక్క లేనా అనుకుంది తన అందం ఎఱజూపి. ఆనాడు తన వారందరినీ కాదని ఈపెండ్లి కొప్పుకుంది అత్తగారు పరమ గయ్యాళి అని తెలిసికూడ. కానీ అంతా తారుమారయింది. తన అందమంతా అడవికాచిన వెన్నెలయింది. తన భర్త ఇంత జడుడనుకోలేదు. మానవుడు తాను తలచేదొకటి. జరిగేదింకొకటి. భారంగా నిట్టూర్చి నిద్రిస్తున్న రమణ వంక చూసింది. ఇంతలో ఒక మెరుపులాంటి ఆలోచన తట్టింది. ఆమెముఖం కాంతిప్రపూరితమైంది. చిరునవ్వు ఆమె పెదవులమీద లాస్యంచేసింది. ఒక నిశ్చయంతో లేచింది. బట్టలన్నీ సర్దుకుంది. డ్రాయరు మీదున్న కాగితం, కలం తీసుకుని వ్రాతలో నిమగ్నయైపోయింది.

## 4

రమణ లేచేసరికి తెల్లవారింది. క్రిందనుండి తల్లి సణుగుడు వినిపిస్తున్నది. గదంతా కలయజూశాడు. గదిలో ఎక్కడా ప్రభ జాడలేదు. ప్రభ సూటుకేసూ లేదు. స్టాండుమీద ఆమె బట్టలూ లేవు. గుండెల్లో రైళ్లు పరుగెట్టాయి. బద్ధకమంతా పటాపంచలయిపోయింది. రాత్రి జరిగిన సంఘటనలు ఒక్కొక్కటే జ్ఞప్తికిరాగా తల్లడిల్లిపోయాడు. గదంతా గాలించాడు. భయం ఆవరించింది అతని మనసును. తల్లిని కేకేయడానికి నోరు తెరచి, ఎదురుగా తలుపు గడియకు తగుల్కొని రెపరెపలాడుతున్న కాగితాన్ని వడికేచేతులతో తీసి వెలుతురులోకి తెచ్చివిప్పాడు. అది ప్రభరాసిన వుత్తరం. ఆత్రంతగా చదవసాగాడు. కాళ్లక్రింది భూమికదిలిపోసాగింది. దాని సారాంశమిది.

శ్రీ...వార్కి నమస్కరించి వ్రాయునది—

ఈ వుత్తరం మీకు కష్టం కలిగిస్తుందని నాకు తెలుసు అయినా కొన్ని కొన్ని పనులు చేయాలంటే కొందరి కొందరికి కష్టం కలిగించవలసి వుంటుంది. దానికి మీరు నన్ను మనసారా క్షమిస్తారని ఆశిస్తున్నాను.

నిన్నటి సంఘటనతో నేను పూర్తిగా పలాజితనై పోయాను. మిమ్మల నా బంగారు సంకెళ్లనుండి విముక్తులనుచేదామని ఎంతో ప్రయత్నించాను. మీ యిద్దరిమధ్య నున్న బంధం అందంకన్నా కూడ గొప్పదని తెలుసుకున్నాను. మీ మాతాపుత్రులను వేరు చెయ్యడానికి నేనెవరిని? మిమ్మలను విడదీసే హక్కు నాకెవరిచ్చారు? ఈ ప్రశ్నలు నన్ను నేను సూటిగా వేసుకున్నాను. వాటికి ఒకటే జవాబు తోచింది. మీ యిద్దరి మధ్యనుండి తప్పుకుంటేనే బాగుం దనిపించింది. ఇన్నాళ్లు నామూలంగా మీకు మనశ్శాంతి లేకుండా పోయిందని నాకు తెలుసు. ఇకనుండైనా మీరు ప్రశాంతంగా కాలం వెళ్లబుచ్చగలరని ఆశిస్తున్నాను.

ఇక నాకూ మీకూ సంబంధం సరేనేమో అనుకుంటున్నాను. మీ యింట నా అందం కొరగానిదైపోయింది. అందుకే నా అందం రాణించే చోటికేపోతే బాగుంటుందేమో ననుకున్నానుమాతృమూర్తి మీద ప్రేమతో నిండిన మీ హృదయంలో నాకు చోటు లేదని తెలిసే ఈ సాహసాని కొడిగట్టుతున్నాను. ప్రస్తుతానికి మాత్రం నేను మా పుట్టింటికి పోతున్నాను. కొన్నాళ్ళు మా వాళ్లింట్లో ప్రశాంతంగా గడిపి తరువాతి కార్యక్రమము తరువాత నిరయించుకుంటాను. ఆ నరకంనుండి విముక్తురాలనై స్వేచ్ఛావాయువుల్లోకి పోతున్నానంటే నాకెంతో ఆనందంగా వుంది. కాని ఒక్కటే వెలితి. మీరు కూడ వస్తేబాగుండేది......కాని ఎవరేం చేయగలము? అంతా మన మాసించినట్లు జరుగదు. వుంటా. సెలవు —మీ ప్రభ.

ఉత్తరం పూర్తిచెయ్యగానే అతనికి దుఃఖం రాలేదు. శరీరంయావత్తూ కోపానలంతో దహించుకపోయింది. ఆవుత్తరంలోని ప్రతిమాట అతని హృదయానికి సూటిగా నాటుకున్నాయి. అతని పురుషత్వం మేల్కొంది. అతనిమనస్సు నావరించుకున్న బలహీనతంతా పటాపంచలయిపోయింది. బంధంట బంధం! అది తల్లికాదు! రాక్షసి!! ఛీ! తనో పనికిరాని చవటయిపోయాడు. ప్రభను చేతులారా దూరం చేసుకున్నాడు. తనో అసమర్థుడే! ఎంత బాధపడకపోతే తనమీదామెకంత విరక్తి కలుగుతుంది? తనకన్నా జీవాలులేని చెట్లూ చేమలూ నయమేమో? వాటికైనా అనురాగం, సానుభూతి వున్నాయి. తాను మానవుడై వుండికూడ జడపదార్థంలా ప్రవర్తించాడు. అందుకే ఆమె తనమీద విరక్తి తన కెంత అప్రతిష్ఠ?! ఎంత పరువు చేటు?! తనంతవాడిక్కడుండగా తన భార్య ఇల్లువిడిచి పోవడమా? నల్గురిలో తన కెంత తలవంపులూ? ఎంత అవమానం? ఒక్కసారిగా అతనిలో అంతర్యాభతమైయున్న శక్తులన్నీ జాగరితమయ్యాయి. దీనికంతకీ మూలకారణమైన

తల్లిమీద కోపం కట్టలు త్రెంచుక ప్రవహించింది. ఆ వుత్తరం చేత్తో పట్టుకుని గబగబా క్రిందకొచ్చాడు. 'అమ్మా!' అని పొలికేక పెట్టాడు. ఆమె లోపలినుండి బయటికొచ్చింది. కొడుకుశివాలు, చిందులూ చూసి అరికాలిమంట నెత్తికెక్కింది.

'ఏమిట్రా ప్రొద్దున్నే ఈ శివాలూ చిందులూ?'- అడిగింది విసుగ్గా.

'శివాలూ కాదూ! నా బొందా కాదు. ఇదిగో చదువుకో! దీని కంతకూ మూలకారణం నువ్వే!' అని పండ్లు పటపట కొరుకుతూ ఆ వుత్తరం ఆమెమీద విసిరేశాడు. ఆమెముందు నిర్ఘాంతపోయినా తరువాత తేరుకుని ఆ వుత్తరం చదవసాగింది. అది పూర్తిచేసేసరికి ఆమె వుగ్రమూర్తి అయిపోయింది.

'ఓసి దీని అఘాయిత్యంగూల! ఎంతపనికి సాహసించింది.' అని కొడుకువంక తిరిగి 'ఓరి వాజమ్మా! దీన్ని వెనకేసుకొనిరా నామీద ఈ శివాలు చిందులూను. ఇదా నన్ను బెదిరిస్తుంది? పోతేపోనీ! దీని తాతల్లాంటివాళ్ళని లక్షమందిని నీకు మూడుక్షణాల్లో కట్టబెడుతాను...'అత నింక ఆవేశం పట్టలేకపోయాడు'

'నోరు ముయ్యి! కట్టబెడతావుట కట్టబెడుతావు!! గొప్ప తల్లివి బయల్దేరావు? దీన్నిట్లా వుద్ధరించావు? ఇంకే మిగతావాళ్ళను కట్టబెట్టి వాళ్ళ గొంతులు కోస్తావు. .అమ్మా! ఇక నీ కొడుకు పాతకొడుకు కాదు." అంటూ విసురుగా మేడమీదకు నడిచిపోయాడు.

మహాలక్ష్మమ్మ నిర్ఘాంతపోయింది. ఆమె అచేతనురాలై అట్లాగే చాలాసేపు నిలబడిపోయింది. ఇట్లా జరుగుతుందని ఆమె కలలోకూడా వూహించలేదు. ఆమె కంటివెంట రెండేరెండు బిందువులు చెక్కిళ్ళమీదుగా జారి నేలమీదపడి ఇంకిపోయాయి. మనసులోనే ఒక నిశ్చయానికొచ్చి భారంగా వెనుదిరిగింది.

పెరట్లో పెద్ద చప్పుడైంది. బట్టలు సర్దుకుంటున్న రమణ నిశ్చేష్టుడై పోయాడు. కొంతవడికి తెప్పరిల్లాడు. ఇంతట్లో అతనికేదో తట్టింది. ఒక్కసారి అతనిశరీరం యావత్తూ జలదరించిపోయింది. వణికే కాళ్ళతో గబగబా క్రిందకొచ్చి పెరటిలోని నూతివైపు పరుగెట్టాడు. గట్టుమీద ఇంటి తాళాలగుత్తి పెట్టివుంది. నూతిలోకి చూశాడు. బుడగ లొస్తున్నాయి. కెవ్వున పెద్ద కేక పెట్టి అక్కడే పడిపోయాడు. ఇంతలో ఆ కేకలతో అందరూ పోగయారు. ఎట్లాగో చివరకు ఆమెను బయటకుతీశారు. అప్పటికే చాలా నీరుత్రాగేసింది ఆమె. నీరంతా క్రక్కించారు. తలకుకూడా పెద్ద గాయమైంది. డాక్టరు 'బ్రతకటం దుర్లభం! మహా అయితే ఒకటి రెండు రోజు'లన్నాడు. ఇదంతా క్షణంలో సినీమా రీలు లా తిరిగిపోయింది రమణ కండ్లఎదుటే. అందరూ తలో మాట అంటున్నారు. ప్రభకు టెలిగ్రామ్ ఇచ్చారు. ఇది జరుగుతున్నంతసేపు రమణ గ్రుడ్లప్పగించి చూడడంతప్ప ఏమీ చెయ్యలేక పోయాడు. ప్రక్కమీద తెలివిలేకుండా పడుకొనివున్న తల్లి వంకే చూస్తూ కూర్చున్నాడు శిలా ప్రతిమలా!

సాయంత్రం ప్రభ వచ్చింది. అత్తగారి మీద పడి భోరున ఏడ్చింది. తాను చేసినతప్పు తనకి తెలిసింది. చాలా పొరపాటు చేశానని అపుడు గుర్తించింది. కాని ఏం లాభం? చేతులు కాలాక ఆకులు పట్టుకోవడమే అపుడు తాను విచారించడం! అత్తగార్కి పరిచర్యలు చేయసాగింది.

రాత్రి పన్నెండయింది. మహాలక్ష్మమ్మకు తెలివొచ్చింది. ఎదురుగా ప్రభ! ప్రక్కనే తనకొడుకు!! చిన్న చిరునవ్వు నవ్వింది. 'అత్తయ్యా!' అంటూ బావురుమని ఏడ్వ సాగింది ప్రభ. ఆమె చేతితోనే వారించింది. ఇద్దరినీ దగ్గరకు రమ్మని సంజ్ఞ చేసింది. ఇద్దరూ ఆతురతతో ఆమెను చూడసాగారు. ప్రభచేయి తనచేతిలోకి తీసుకుంది. రమణచేతికి ఆమెచేతిలో వుంచింది. నీరసంగా 'ప్రభా! ఇంక నేను నిశ్చింతగా కండ్లు మూస్తాను. ఈ చిన్న పిల్లాడిని చూసుకునే బాధ్యత నీదే. ఆ బాధ్యత నీవు బాగా నిర్వహిస్తావనే నాకు నమ్మకముంది. ......అందుకే చదువుకున్న వాళ్ళంటే స్వతహాగా నాకు ఏవగింపున్నా నీ సామర్ధ్యాన్ని గుర్తించే నిన్ను నా కోడలిగా స్వీకరించాను.... ఇంక వాడికి తల్లివి, తండ్రివి సమస్తమూ నువ్వే'—అంది. ఇంతలో ఆయాసం తెర అడ్డొచ్చింది. తరువాత కొద్దిక్షణాలలోనే మహాలక్ష్మమ్మగారి ప్రాణాలు అనంతవాయువులో లీనమైపోయాయి. 'అత్తయ్యా' అని ఆశవంమీద పడి గొల్లుమంది ప్రభ. తల్లిశవం వంక అట్లాగే చూస్తూ ఏదో గొణుక్కున్నాడు రమణ తనలో.

*   *   *   *

అత్తగారి అధికారంనుండి విముక్తురాలైంది ప్రభ!

తల్లి బంధాలనుండి విముక్తుడైనాడు రమణ!

ఈ ఇహలోక బంధాలనుండే విముక్తురాలైంది మహాలక్ష్మమ్మ!

గాలిపటం దారాలన్నీ ప్రభహస్తగత మయ్యాయి.

భర్తకూ, ఆస్తికీ సర్వాధికారిణి ప్రభ!

భూమిగుండ్రంగానే వుంది!

'క్రొత్త జీవితంలో' 'స్వేచ్ఛావాయువులు' పీల్చసాగాడు రమణ!

జీవితవలయము పునః ప్రారంభమయింది.